

కిలకిల అందాలు!

నేలపట్టు పక్షుల కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. గూడ బాతులు జతకట్టి విడిది చేస్తున్నాయి. - 8లో



అనన్యం.. అమరవీరుల త్యాగం

పోలీసు అమర వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. - 8లో



జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక

ఏర్పేడు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పెంచలకోన ఆలయాల మూసివేత



పెంచలకోనలోని శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తున్న సిబ్బంది

రాపూరు: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాలను శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేసినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 5 నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు ఆలయాలు మూసివేస్తామన్నారు. ఆ తర్వాత ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, నిత్యకైంకర్యాల అనంతరం తిరిగి ఆదివారం ఉదయం 8 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి తుడా: నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. స్థానిక తిలక్ రోడ్డు నుంచి గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్లను కలుపుతూ నిర్మిస్తున్న లింక్ రోడ్డును డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌వంశీ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: స్థానిక అలిపిరి ఆర్టీసీ డిపోలోని ట్రైనింగ్ కళాశాలలో 24వ బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వడానికి నవంబర్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు డిపో మేనేజర్ హరిబాబు తెలిపారు.ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 23వ బ్యాచ్‌కి మరో 20 రోజుల్లో శిక్షణ ముగుస్తుందని వెల్లడించారు. అనంతరం 24వ బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

సమష్టిగా పాల సేకరణ

తిరుపతి అర్బన్: జగనన్న పాలసేకరణలో భాగంగా అన్ని విభాగాల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో సహకార సంఘంతోపాటు పశుసంవర్ధకశాఖ, డీఆర్డీఏ, మెప్మా శాఖలు సమన్వయంతో చేయూత కింద లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు, పాడి పశువుల కొనుగోలు తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: వాల్మీకి మహర్షి జయంతిని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి కార్యక్రమానికి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి, సమాచార పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

డిజిటల్ వెంబడి

అభ్యసనా సామర్థ్యమెరుగు



ఐపీఎఫ్ ప్యానల్‌తో పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగయ్యింది. దీంతో పాటు ఆండ్రాయిడ్ బాక్స్, 4జీ ఇంటర్నెట్ ఇవ్వడంతో పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని ప్లే చేసుకోవచ్చు. డయాగ్రామ్‌లను 3డీ రూపంలో చూపించడం ద్వారా వాటిని సులువుగా అర్థం చేసుకోగలరు. ఈ ప్యానల్‌నే బ్లాక్ బోర్డులా వాడుకునే సౌకర్యం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న డిజిటల్ విద్యతో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడతారనడంలో సందేహం లేదు.

– డాక్టర్ కే.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, ఆర్.మల్లవరం, రేణిగుంట మండలం

సులువుగా అర్థమవుతోంది



ఇదివరకుకంటే ఇప్పుడు ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు చాలా సులువుగా అర్థమవుతున్నాయి. ఐఎఫ్‌పీ ప్యానల్‌లో పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలను ప్లే చేసి చూపుతున్నారు. దీని వల్ల పాఠాలు చక్కగా అర్థమవడంతో పాటు అవి అలానే గుర్తుండిపోతున్నాయి. అభ్యసనా సామర్థ్యం మెరుగయ్యింది. పదిలో మంచి మార్కులు సాధించగలననే నమ్మకం కలిగింది.

– బత్తిరెడ్డి, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్, ఆర్.మల్లవరం, రేణిగుంట మండలం



తిరుపతి కొర్లగుంటలోని ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి జిల్లా సమాచారం

పాఠశాల	సంఖ్య	విద్యార్థుల సంఖ్య	టీచర్ల సంఖ్య
ప్రాథమిక	1,818	53,415	3,059
ప్రాథమికోన్నత	194	14,965	1,120
ఉన్నత	323	92,876	4,051
మొత్తం	2,335	1,61,256	8,230

స్మార్ట్ బోధన ఇలా..

- తరగతి గదిలో ఉపాధ్యాయుని సమక్షంలో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా పాఠ్యాంశాలను దృశ్య రూపంలో బోధిస్తారు.
- ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను డిజిటల్ విద్యకే కాకుండా బ్లాక్ బోర్డులా ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది. దీనిపై రాసిన వాటిని తుడిపేయొచ్చు. అలాగే వాటిని సేవ్ చేసుకునే అవకాశం కూడా ఉంది.
- ఇంటర్నెట్ వినియోగించుకుని కంప్యూటర్ లాగే ఈ తెరపై యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లోని సమాచారాన్ని పెద్ద స్క్రీన్‌పై చూస్తూ పాఠాలు నేర్చుకోవచ్చు. దీని ద్వారా సులువుగా అర్థం చేసుకోవచ్చు.
- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు.

'ప్రతి పిల్లోడు గొప్పగొప్ప చదువులు చదవాలి. ప్రతి ఇంటి నుంచి పెద్దపెద్ద ఇంజినీర్లు, డాక్టర్లు రావాలి. మనం పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి చదువు ఒక్కటే. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మీ మేనమామగా నేను చదివిస్తాను.. మీరు చదవండి' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. పనులు పూర్తయిన పాఠశాలల్లో డిజిటల్ విద్యకు కావాల్సిన సరంజామాను సమకూర్చారు. పేద పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నారు. జిల్లాలో అమలవుతున్న డిజిటల్ బోధన విధానంపై స్పెషల్ ఫోకస్..

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన

- ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలతో బోధన
- పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం
- నాడు – నేడుతో మారిన రూపురేఖలు
- విద్యార్థుల్లో మెరుగుబడుతున్న అభ్యసనా సామర్థ్యం

సాక్షి ఫోకస్

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి వచ్చాయి. నాడు–నేడు పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను ప్రభుత్వం సరఫరా చేసింది. 'నాడు' బ్లాక్ బోర్డులపైన సాగిన బోధన 'నేడు' ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల్లో సాగుతోంది. దీనికోసం ఆయా పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగయ్యింది.



తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)పై పాఠ్యాంశానికి సంబంధించిన ముఖ్యమైన పాయింట్లను రాస్తున్న విద్యార్థిని

ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల పంపిణీ

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 330 ప్రభుత్వ యాజమాన్య ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో నాడు–నేడు పూర్తయిన 179 పాఠశాలలకు 1,110 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ)ను అందజేశారు. మిగిలిన 151 పాఠశాలలకు డిసెంబర్‌లోగా ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను అందించేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,120 ప్రాథమిక పాఠశాలలకు సంబంధించి నాడు–నేడు పూర్తయిన 236 పాఠశాలలకు 350 స్మార్ట్ టీవీలను అందజేశారు. నాడు–నేడు పూర్తవ్వగానే మిగిలిన పాఠశాలలకు స్మార్ట్ టీవీలను అందజేయనున్నారు.

అన్ని పాఠశాలలకు అందిస్తాం



తిరుపతి జిల్లాలో నాడు–నేడు పనులు పూర్తయిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీ ప్యానల్స్, ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలను అందించాం. 4జీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాం. ఇప్పటికే వీటి ద్వారా విద్యాబోధన జరుగుతున్న పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, పాఠ్యాంశాలపై పట్టు చాలా మెరుగయ్యింది.

– జీ.సురేష్, బైజూస్ జిల్లా నోడల్ అధికారి, తిరుపతి

నైపుణ్యం మెరుగు



దృశ్య, శ్రవణ రూపంలో జరిగే విద్యాబోధనతో విద్యార్థులు చాలా సులువుగా పాఠ్యాంశాలను నేర్చుకుంటారు. సబ్జెక్టుపై పట్టు సాధిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దాలన్న సత్సంకల్పంతో ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలను ప్రభుత్వం అందిస్తోంది. వీటి ద్వారా విద్యార్థులు చాలా ఆసక్తితో పాఠాలను నేర్చుకుంటున్నారు.

– డాక్టర్ వీ.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

సొంతింటి కల సాకారం



టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



హాజరైన లబ్ధిదారులు

- 192 మందికి టిడ్కో గృహాల అందజేత
- త్వరలో మరికొన్ని ఇళ్లు పంపిణీ
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం, (వెంకటగిరి): కోట్ల రూపాయల విలువ గల స్థలాలను ఇళ్ల పట్టాల రూపంలో ఇచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శనివారం 192 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లులేని పేదలకు పైసా ఖర్చు లేకుండానే ఇళ్లు అందించిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గృహాలకు సంబంధించి చెల్లించాల్సిన రూ.500ను కూడా తానే చెల్లించానన్నారు. మౌలిక వసతులన్నీ పూర్తిచేసి మిగిలిన గృహాలను మంత్రి ఆదిమూలం సురేష్ చేతులు మీదుగా త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జీ ఢిల్లీబాబు, వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పోలేరమ్మ దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షులు పులిప్రసాద్‌రెడ్డి, కమిషనర్ వెంట్రామయ్య, కౌన్సిలర్లు ఏ నారాయణ, మాడా జానకీరామయ్య, ఆది శంకరయ్య, వహీదా, రందాటి కళ్యాణి, సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 63,659 మంది స్వామివారిని దర్శించుకోగా 26,659 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.42 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, ఈఓ ధర్మారెడ్డి

● గ్రహణ కాలం

పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా జిల్లాలోని అన్ని ఆలయాలు మూతపడ్డాయి. తిరుమలలోని శ్రీవారి ఆలయాన్ని శనివారం సాయంత్రం 7.05 గంటలకు మూసివేశారు. తిరిగి ఆదివారం తెల్లవారు జామున 3.15 గంటలకు తెరవనున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మాత్రం యథాతథంగా తెరిచే ఉంచారు. అర్చకులు గ్రహణ కాల అభిషేకాలు నిర్వహించారు.

– తిరుమల/ శ్రీకాళహస్తి



తెరిచే ఉంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం

క్లుప్తంగా

కార్గో సేవలు వేగవంతం



ఫ్యాన్లను పరిశీలిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను వేగవంతం చేయాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తిరుపతి బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌ను పరిశీలించారు. కార్గో సెంటర్ వద్ద వెయిటింగ్ లేకుండా వెంటనే బుకింగ్ చేసి పంపాలని సిబ్బందిని ఆదేశించారు. ఎనర్జీ కన్జర్వేషన్ అందజేసిన 300 ఫ్యాన్లు బస్టాండ్‌లో అమర్చాలన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యూజీ పరీక్షలు

తిరుపతి సిటీ: యూజీ పరీక్షలు డిసెంబర్‌లో నిర్వహించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ దామల్లానాయక్ తెలిపారు. యూజీ ఫస్ట్ అండ్ థర్డ్ ఇయర్ పరీక్షలను డిసెంబర్ మొదటి, మూడో వారంలో నిర్వహిస్తామని, ఆ మేరకు విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన సూచించారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి బీఏ, బీకాం, బీఎస్సీ, బీహెచ్ఎం, బీబీఏ, బీ.మ్యూజిక్, బీ.డ్యాన్స్ గ్రూపులకు సంబంధించి అన్ని పరీక్షలకు అయితే రూ.1,080, ఒక్కో పేపర్ అయితే రూ.560, రెండు పేపర్లు అయితే రూ.930, మూడు పేపరు.. ఆ పైన అయితే రూ.1,080 ఫీజు చెల్లించాలని చెప్పారు. థర్డ్ ఇయర్‌లో మొత్తం పరీక్షలకు అయితే రూ.1,220, ఒక్కో పేపర్ అయితే రూ.570, రెండు పేపర్లు అయితే రూ.970, మూడు.. ఆ పైన పేపర్లకు అయితే రూ.1,220 చెల్లించాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ 29వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఫీజు నవంబర్ 10వ తేదీలోపు చెల్లించాలన్నారు. అదనపు రుసుం రూ.500 చెల్లిస్తే నవంబర్ 11 నుంచి 14వ తేదీ వరకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

బాలికల సైనిక్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : కర్ణాటక రాష్ట్రం, కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్లో 2024–25లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదలైనట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్ష 2024, జనవరి 28న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారని, ఈ పరీక్షకు 2012, జూన్ 1నుంచి 2014, మే 31వ తేదీలోపు జన్మించిన వారు అర్హులన్నారు. అవసరమైన సమాచారాన్ని తిరుపతిలోని విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో నేరుగానూ, 93999 76999, 86888 88802లోను సంప్రదించాలని ఆయన కోరారు.

అనన్యం..అమరవీరుల త్యాగం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



శిబిరానికి హాజరైన పోలీసు అధికారులు

- 500 మందికి పైగా రక్తదానం

తిరుపతి క్రైం: అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తిరుచానూరు సమీపంలోని ఓ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో పోలీసులతోపాటు, పాత్రికేయులు, ప్రజలు, కరకంబాడి సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు సుమారు 500 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారి నుంచి సుమారు 787 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం కష్టపడి పనిచేసేది కేవలం పోలీసేనన్నారు. రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణాన్ని కాపాడిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, లక్ష్మీనారాయణ రెడ్డి, డీఎస్పీలు గిరిధర్, యశ్వంత్, సురేందర్‌రెడ్డి, భవ్య కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీవారి సారె ట్రయల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్‌ను నిర్వహిస్తున్న అధికారులు

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను నవంబర్ 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానమైన పంచమీ తీర్థానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకోనున్నారు. అదే రోజున తిరుమల శ్రీవారు తన పట్టపురాణికి పుట్టిన రోజు కానుకను తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తిరుచానూరుకు అధికారులు తీసుకురానున్నారు. తిరుపతి అలిపిరి వద్దకు చేరుకున్న తర్వాత అక్కడ నుంచి అంబారీపై ఊరేగింపుగా కోమలమ్మ సత్రం మీదుగా తిరుచానూరుకు రావడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం కోమలమ్మ సత్రం నుంచి తిరుచానూరుకు శ్రీవారి సారెను టీటీడీ అధికారులు ట్రయల్ రన్‌ను విజయవంతంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్‌బాబు, డీఎస్పీ నందకిషోర్, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, టీటీడీ పీఆర్ఓ రవి, వీఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

5న మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వేదికగా డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జీ.నారాయణప్ప, పీ.భాస్కరయ్య తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, హేమర్‌త్రో, డిస్కస్ త్రో, వివిధ కేటగిరీల్లో పరుగు పందెం, పోల్ ఓల్ట్, 5వేల మీటర్ల నడక వంటి వాటిల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ ఎంపిక పోటీలకు 30 నుంచి 90 ఏళ్లలోపు వయస్సున్న వారు పాల్గొనవచ్చని, ఆయా విభాగాల్లో అర్హత సాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున తలపడతారని తెలిపారు. వివరాలకు 96523 72956, 98663 60809 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక



జిమ్నాస్టిక్స్ ఆడుతున్న విద్యార్థులు

ఏర్పేడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ అండర్–14, అండర్–17 పోటీలకు విద్యార్థుల ఎంపిక జరిగింది. పలు మండలాల నుంచి 48 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఏర్పేడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మ్యాన్ గ్రూప్ నుంచి జీవన్‌కుమార్, అభిషేక్, గణేష్, ధనూష్, ఫ్లోర్ ఈవెంట్ నుంచి ఆదర్శ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. శ్రీకాళహస్తి బాయ్స్ హైస్కూల్ నుంచి రిబ్బన్ అండర్–14లో ఒకరు, శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రింగ్ ఈవెంటర్ అండర్–14లో ఒకరు, ఫ్లోర్ ఈవెంట్ తిరుపతి ఎంజీఎం నుంచి ముగ్గురు, శ్రీకాళహస్తి మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు, మరో 4 పాఠశాలల నుంచి మొత్తం 12 ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్ 3న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని పీఈటీ శివకుమార్ చెప్పారు. ఉపాధ్యాయులు అనూరాధ, గురుస్వామి, పాల్గొన్నారు.

ఒకే బాణం..ఒకే మాట!

తిరుపతి సిటీ: ఒకే బాణం..ఒకే మాట రాముని తత్వమని టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం భాస్కరరెడ్డి తెలిపారు. శనివారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగం, సింగపూర్ తెలుగు సమాజం, చిత్తూరు శ్రీదశరథ రామా ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ధర్మప్రచారంలో భాగంగా శ్రీ రామాయణం శరణాగతి శాస్త్రం అంతర్జాతీయ వెబినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మ ప్రచారానికి టీటీడీ ముందుంటుందన్నారు. అనంతరం సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.మహదేవమ్మ ప్రసంగిస్తూ రామాయణం చదవడం వల్ల సంస్కృతి సంప్రదాయాలు అలవడతాయన్నారు. వెబినార్ సంచాలకులు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృషవేణి మాట్లాడుతూ భగవంతుడు మానవ రూపంలో శ్రీరామునిగా జన్మించి మానవులు ఎలా బతకాలో చూపించారన్నారు. ఆదికావ్యం రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవితం అందరూ గ్రహించాలన్నారు. ఇండోనేషియా నుంచి రామాయణ హరినాథరెడ్డి, సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు బొమ్మిరెడ్డి, ఉపాధ్యక్షులు జ్యోతీశ్వర్‌రెడ్డి, ఆస్ట్రేలియా నుంచి భార్గవి, న్యూజిలాండ్ నుంచి కవిత, పోలీస్ అధికారి సుప్రజ, సత్యనారాయణమూర్తి పాల్గొని ప్రసంగించారు.

ప్రేమికురాలు మాట్లాడలేదని..!

తిరుమల: ప్రేమికురాలు మాట్లాడడం లేదని తిరుమలలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో కార్మికుడిగా పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కదిరికి చెందిన శ్రీనివాసులు(22) ఓ ప్రైవేటు అతిథిగృహంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యువతితో మనస్పర్థలు రావడంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. అతిథిగృహం పైకి వెళ్లి గొంతును పదునైన ఆయుధంతో కోసుకున్నాడు. వెంటనే గుర్తించిన తోటికార్మికులు అతడిని తిరుమలలోని టీటీడీ అశ్విని ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకి తరలించారు. దీనిపై పోలీసులు పరిశీలిస్తున్నారు.

కిలకిల అందాలు!

- నేలపట్టు పక్షుల కేంద్రంలో విదేశీ విహంగాలు
- సందడి చేస్తున్న గూడబాతులు
- భారీగా తరలివస్తున్న పక్షి ప్రేమికులు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రం విదేశీ విహంగాలతో అలరారుతోంది. వలస విహంగాల్లో రారాజులుగా పిలువబడే గూడబాతులు(గ్రేపెలికాన్స్) పక్షం రోజుల కిందట వందల సంఖ్యలో దిగి విడిది చేస్తున్నాయి. అత్తిగుంట, నేరేడుగుంట, మారేడుగుంట చెరువుల్లో అరకొరగా ఉన్న వర్షపునీటిలో ఆహార వేట కొనసాగిస్తున్నాయి. స్థానికంగా ప్రసిద్ధి చెందిన గూడబాతులు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కుకొంగలు తదితర పక్షుల రాక ఇప్పటికే మొదలైంది. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో సీజన్‌కు ముందే విచ్చేసిన నత్తగుల్లకొంగలు(ఓపెన్‌బిల్‌స్టార్క్స్) 600, నీటికాకులు 250, స్వాతికొంగలు 150కి పైగా ఉన్నట్టు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు. వీటితో పాటు తెల్లకంకణాయిలు 200, గూడబాతులు సుమారు 400, బాతు జాతికి చెందిన పలు రకాల పక్షులు పదుల సంఖ్యలో విడిది చేస్తున్నట్టు వెల్లడించారు. వీటిని వీక్షించేందుకు రాష్ట్ర నలుమూల నుంచే కాకుండా బయట రాష్ట్రాల నుంచి కూడా పక్షి ప్రేమికులు విచ్చేస్తున్నట్టు తెలిపారు. సందర్శకుల కోసం తాగు నీరు, చెరువు కట్టపై పక్షుల జీవన శైలి వివరించేందుకు నేచర్ గైడ్, వ్యూ పాయింట్ల వద్ద వీక్షించేందుకు బైనోక్యులర్స్ వంటివి అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. పర్యావరణ కేంద్రంలో విహంగాల జీవన శైలి చిత్రాల ప్రదర్శన కూడా సిద్ధం చేసినట్టు తెలిపారు.







పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న గూడబాతులు

తిరుపతి డీఎంహెచ్‌ఓపై విచారణ

చిత్తూరు రూరల్: తిరుపతి డీఎంహెచ్ఓ శ్రీహరి చిత్తూరు జిల్లాలో పనిచేసే సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదుపై శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే, డిప్యుటేషన్లు, బదిలీలు, అపాయింట్‌మెంట్‌లు, పోస్టుల భర్తీలో అవినీతికి పాల్పడ్డారంటూ పబ్లిక్, మెడికల్ సొసైటీ కౌన్సిల్ పేరుతో మే 18న ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు ఉత్తరం వెళ్లింది. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విచారణ అధికారిగా కర్నూలు డీఎంహెచ్ఓ రామగిడ్డయ్యను నియమించారు. ఈ మేరకు ఆయన శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారుల సమక్షంలో విచారణ చేశారు. కొన్ని రికార్డులను పరిశీలించారు. మెడికల్ సంఘాలను పిలిచి విచారించారు. వారు ఆ ఫిర్యాదుకు తమకు ఎలాంటి సంబంధం లేదని రాత పూర్వకంగా రాసిఇచ్చారు. దీంతో ఫిర్యాదులోని అంశాలను విచారణ అధికారి కొట్టిపడేసినట్లు తెలిసింది.



విచారణలో అధికారులు